క్లుప్తంగా

తలశిల రఘురామ్‌ను పరామర్శించిన శిద్దా


రఘురామ్ సతీమణి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శిద్దా రాఘవరావు

ఒంగోలు: ఎమ్మెల్సీ తలశిల రఘురామ్‌ను మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు శిద్దా రాఘవరావు బుధవారం పరామర్శించారు. ఇటీవల తలశిల రఘురాం సతీమణి స్వర్ణ కుమారి మరణించిన విషయం తెలిసిందే. విజయవాడలోని గొల్లపూడిలో నిర్వహించిన దశదిన కర్మకు హాజరైన శిద్దా రాఘవరావు.. స్వర్ణకుమారి చిత్రపటం వద్ద పుష్పాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం తలశిల రఘురామ్‌ను పరామర్శించారు.

నేడు సర్వసభ్య సమావేశం

గిద్దలూరు రూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో ఎంపీపీ కడప లక్ష్మి అధ్యక్షతన గురువారం ఉదయం 11 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఆకుల రంగనాయకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

రేపు చిత్రలేఖనం పోటీలు

మార్కాపురం టౌన్: జమాతే ఇస్లామి హింద్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 17 తేదీ ఉదయం 10 గంటలకు మార్కాపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మానవత నైతికతపై చిత్రలేఖనం పోటీలు ఏర్పాటు చేసినట్లు ఉపాధ్యక్షుడు షేక్ సికిందర్ తెలిపారు. 5 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని, వివరాలకు 88977 76046 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

బైకు అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

కురిచేడు: ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని పడమర నాయుడుపాలెం–వీవై కాలనీల మధ్య బుధవారం రాత్రి చోటుచేసుకుంది. 108 సిబ్బంది అందించిన వివరాల ప్రకారం.. వీవై కాలనీకి చెందిన బి.లక్ష్మయ్య కురిచేడులో బేల్దారి పనులు ముగించుకుని తన ద్విచక్ర వాహనంపై ఇంటికి బయల్దేరాడు. పడమర నాయుడుపాలెం దాటగానే తాను వెళ్తున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడటంతో తలకు గాయమైంది. 108 సిబ్బందికి సమాచారం అందించడంతో సిబ్బంది మహబూబ్‌బాషా, రెహమాన్‌లు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం వినుకొండలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

శివాలయం అభివృద్ధికి మాజీ మంత్రి శిద్దా విరాళం

దర్శి: మండలంలోని పోతవరం శివాలయం అభివృద్ధికి మాజీ మంత్రి శిద్దా రాఘవరావు లక్ష రూపాయల విరాళం ప్రకటించారు. ఆ మొత్తం నగదును ఆయన ప్రతినిధి మండాది సుబ్బారావు అందజేశారు. బుధవారం పోతవరంలో ఆలయ ధర్మకర్త కొప్పురావూరి బాబురావుకు మండాది సుబ్బారావు లక్ష రూపాయల నగదు అందజేశారు.

ఫ్లోరోసిస్‌తో జాగ్రత్త


అవగాహన కల్పిస్తున్న జిల్లా ఫ్లోరోసిస్ నియంత్రణ అధికారి అనిల్‌కుమార్

ముండ్లమూరు: గ్రామీణ ప్రాంత ప్రజలు ఫ్లోరోసిస్ పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఫ్లోరోసిస్ నియంత్రణ అధికారి వేము అనిల్‌కుమార్ అన్నారు. చింతలపూడి, ముండ్లమూరు, పెద ఉల్లగల్లులో బుధవారం పర్యటించారు. ఈసందర్భంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో ఫ్లోరోసిస్ బారిన పడి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వం పలు రకాల యంత్రాలను అందజేస్తామని తెలిపారు. నడుముకు కట్టుకునే బెల్ట్, నడక కర్ర, వీల్ చైర్ ఉచితంగా అందిస్తామని చెప్పారు. అనంతరం ఫ్లోరోసిస్ పరీక్షలు చేశారు. ముండ్లమూరు వైద్యాధికారి వి. జ్యోతి, సీహెచ్‌ఓ నారాయణరావు, హెల్త్ విజిటర్ కన్యాకుమారి పాల్గొన్నారు.

విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలి

● ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

పొదిలి రూరల్: పాఠశాల యజమాన్యం, ఉపాధ్యాయులు పిల్లల పట్ల శ్రద్ధ తీసుకొని భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. బుధవారం రాత్రి పొదిలి నిర్మలా కాన్వెంట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ 41వ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు ఆటలు ముఖ్యమని, ప్రతి పాఠశాలలో విద్యతో పాటు క్రీడలు ప్రోత్సహించాలన్నారు. అనంతరం వివిధ అంశాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల నిర్వాహకులతో పాటు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సాయిరాజేశ్వరరావు, మాజీ ఎంపీపీ కె. నరసింహారావు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే..

● రూరల్ మండలం ఏర్పాటుపై ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి


బాలినేనిని సన్మానిస్తున్న ఎంపీపీ పల్లపోలు, తదితరులు

ఒంగోలు రూరల్: ప్రజల రెవెన్యూ సమస్యలు, పాలనాపరమైన సమస్యలు పరిష్కరించేందుకు ఒంగోలు మండలాన్ని రెండుగా విభజించి అర్బన్ మండలంతో పాటు రూరల్ మండలాన్ని ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. రూరల్ మండలం ఏర్పాటుపై ఒంగోలు రూరల్ పరిధిలోని ప్రజాప్రతినిధులు, నాయకులు బుధవారం ఒంగోలులో బాలినేనిని కలిసి సన్మానించారు. దశాబ్ద కాలంగా ఒంగోలు రూరల్ ప్రజలు ఎదురుచూస్తున్న రూరల్ మండలం కోరికను నెరవేర్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అనంతరం ఒంగోలు తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో రూరల్ తహసీల్దార్ కార్యాలయం, తహసీల్దార్‌ను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. బాలినేనిని కలిసి సన్మానించిన వారిలో ఒంగోలు ఎంపీపీ పల్లపోలు మల్లికార్జునరెడ్డి, కరవది సొసైటీ చైర్మన్ వాకా కృష్ణారెడ్డి, ఒంగోలు వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సోమశేఖర్, మాజీ వైస్ ఎంపీపీ అంచిపోగు రమేష్‌బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు జాజుల శ్రీనివాస్, దశరాజుపల్లె చంద్రశేఖరరెడ్డి తదితరులు ఉన్నారు.

శేష వాహనంపై స్వామి వారు


ప్రత్యేక అలంకారంలో స్వామివారు

పొదిలి రూరల్: మహాశివరాత్రి సందర్భంగా పొదిలిలో జరుగుతున్న పార్వతీదేవి సమేత నిర్మమహేశ్వర స్వామి బ్రహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. రోజుకు ఒక అలంకరణలో స్వామి వారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఐదో రోజు బుధవారం స్వామి వారు శేషవాహనంపై అర్ధనారీశ్వర అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం పార్వతీ పరమేశ్వరిని ఉత్సవ మూర్తులను పూలతో ప్రత్యేక అలంకరణ చేసి పొదిలి పురవీధుల్లో ఊరేగించారు. ఉభయదాతలు చీమలమర్రి వెంకట సుబ్బరామకుమార్, రాధాకృష్ణమూర్తి, రామ్మూర్తి, పురుషోత్తమరావులు ప్రత్యేక పూజలు చేసి తమ మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం నైవేద్యాలు చెల్లించి తీర్థ ప్రసాదాలు భక్తులకు స్వీకరించారు.

18న మెడికల్ క్యాంప్

మార్కాపురం: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 18న తిప్పాయపాలెంలో డాక్టర్ పగడాల లక్ష్మీరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అరుణాచల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ తరపున మెగా మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ లక్ష్మీరెడ్డి తెలిపారు. రాష్ట్రంలో వివిధ హాస్పిటల్స్‌లో పనిచేస్తున్న ప్రముఖ సూపర్ స్పెషాలిటీ వైద్యులు సీతల్‌సింగ్, బార్గవ్‌వర్ధన్‌రెడ్డి, కె.నరేంద్రరెడ్డి, వై.కిషోర్‌కుమార్‌రెడ్డి, గౌడ శ్రీహరి, టి.శశిధర్, పీఎల్ వెంకట పక్కిరెడ్డి, వినయ్‌కుమార్‌రెడ్డి, వైద్య సంజీవులు హాజరై రోగులకు పరీక్షలు చేస్తారని, మార్కాపురం ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని లక్ష్మీరెడ్డి కోరారు.

ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలి


ఉపాధి హామీ పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ రంగసుబ్బరాయుడు

యర్రగొండపాలెం: గ్రామాల్లో వ్యవసాయ పనులు తగ్గిన నేపథ్యంలో ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీఓ ఎం.రంగసుబ్బయ్య ఆదేశించారు. బుధవారం స్థానిక పుల్లలచెరువు రోడ్డులో ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన టెక్నికల్ అసిస్టెంట్ల సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడారు. మిరప కోతల సీజన్ పూర్తి కావస్తోందని, కూలీలకు పనులు దొరకక వలస వెళ్లే అవకాశం ఉందన్నారు. వారికి స్థానికంగానే పనులు కల్పించినట్లయితే వలసలు నివారించవచ్చని చెప్పారు. ఆయన వెంట ఏపీఓ నాగేశ్వరరావు, ఈసీ అనీల్ ఉన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

ముండ్లమూరు: మండల కేంద్రం ముండ్లమూరులో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను బుధవారం ఏపీఓ కొండయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రోజూ మూడు వేల మంది కూలీలు పనులు చేయాలని ప్రతిపాదించగా ప్రస్తుతం 2014 మంది కూలీలు పనులు చేస్తున్నట్లు తెలిపారు. జాబ్‌కార్డు అడిగిన ప్రతి కుటుంబానికి కార్డులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కూలీలకు పనుల వద్ద అన్ని వసతులు కల్పించాలని క్షేత్ర సహాయకులను ఆదేశించినట్లు ఏపీఓ తెలిపారు. ఆయన వెంట సాంకేతిక సహాయకులు అశోక్, క్షేత్ర సహాయకుడు ఫిలిఫ్‌రాజు ఉన్నారు.

దొనకొండలో అభివృద్ధి పనులు

దొనకొండ: దొనకొండలో ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపట్టింది. స్పెషల్ గ్రాంట్ రూ.2.60 కోట్ల నిధులతో సిమెంట్ రోడ్డు, సైడు కాలవలు, తారు రోడ్డు పనులు చురుగ్గా సాగుతున్నాయి. రైల్వే స్టేషన్ నేమ్ బోర్డు నుంచి ఇండియన్ పెట్రోల్ బంక్ వరకు సిమెంట్ రోడ్డు, సైడు కాలవలు, పెదన్నపాలెం, దొండపాడు గ్రామాల వరకు 5 కిమీ తారు రోడ్డు పనులు పూర్తి చేశారు. బుధవారం పంచాయతీరాజ్ సెక్షన్ ఇంజినీర్ వై.నాగేశ్వరరెడ్డి, డీఈ జి.కృష్ణ పనులు పరిశీలించారు. నాణ్యత లోపాలు లేకుండా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వివరించారు.

విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనం


వంటలు పరిశీలిస్తున్న వైద్యాధికారి జ్యోతి

ముండ్లమూరు: విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని వైద్యాధికారి వి.జ్యోతి తెలిపారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆమె బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో సరైన వసతులు ఉన్నాయా లేవా అని ఆరా తీశారు. ప్రధానంగా తాగునీరు, తరగతి గదులు శుభ్రత, పరిసరాల పరిశుభ్రత, వంట గదులను పరిశీలించారు. వారికి అందుతున్న భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ప్రిన్సిపాల్ ఆవుల సునీత, సీహెచ్‌ఓ నారాయణరావు ఉన్నారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి


మాట్లాడుతున్న ఏఓ బుజ్జిబాయి

పెద్దారవీడు: పంటల సాగులో రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని వ్యవసాయాధికారి బుజ్జి బాయి సూచించారు. బుధవారం గొబ్బూరు గ్రామ రైతు భరోసా కేంద్రంలో పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ.. చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు తెలియజేశారు. విషపూరిత మందులు తక్కువ మోతాదులో వాడాలని, వాటి వలన కలిగే నష్టాలు, మందులు పిచికారీ చేసేటప్పుడు ఉపయోగించాల్సిన మాస్కులు, ధరించవలసిన దుస్తుల గురించి వివరించారు. సస్యరక్షణ చర్యలు పాటిస్తే మంచి దిగుబడి సాధించవచ్చన్నారు. మండలంలో 1800 మంది ఈకేవైసీ చేయించుకోలేదని, ప్రభుత్వం గడువు పొడిగించిన నేపథ్యంలో సచివాలయాల్లో సంప్రదించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో వీఏఏ, రైతులు పాల్గొన్నారు.

అందుబాటులో సమీకృత దాణా

పొదిలి రూరల్: వేసవి కాలం సమీపిస్తూ ఉండటంతో పశువులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు ముందస్తుగా సమీకృతదాణాను (టీఎంఆర్) అందుబాటులో ఉంచినట్లు ఉప్పలపాడు పశు వైద్యాధికారి డాక్టర్ మంచికల మణిశేఖర్ తెలిపారు. పొదిలి మండలంలో అన్ని సచివాలయాల పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో దాణాను పశుపోషకులకు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. మండలంలో తెల్లజాతి పశువులు ఆవులు, ఎద్దులు 668, నల్లజాతి పశువులు 14,171 ఉన్నాయన్నారు. అందరికి సరిపడా టీఎంఆర్ దాణా అందుబాటులో ఉందన్నారు. ఒక్కో కేజీ దాణా రూ.6.50 ధరకు ఇస్తామన్నారు. అవసరమైన రైతులు తమ పరిధిలో ఉన్న రైతు భరోసా కేంద్రాల్లో ఆధార్‌కార్డుతో నమోదు చేసుకోవాలన్నారు.

తుప్ప తెగులు నివారణకు చర్యలు


శనగ పైరును పరిశీలిస్తున్న ఏవో ప్రసాదరావు

తాళ్లూరు: పగటి పూట అధిక ఉష్ణోగ్రతలు, రాత్రి పూట మంచు కారణంగా అనను కూల పరిస్థితుల్లో శనగలో తెగుళ్ల ప్రభావం ఉంటుందని, తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయాధికారి ప్రసాదరావు కోరారు. మల్కాపురం, రజానగరంలో శనగ పైరును బుధవారం పరిశీలించారు. శనగలో వచ్చు తుప్పు తెగులు నివారణ చర్యలను సూచించారు. సర్పంచ్ షేక్ వలి, వీఏఏ అశోక్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఫోరం ఏర్పాటు


చైర్మన్‌కు సమస్య వివరిస్తున్న వినియోగదారుడు

మార్కాపురం టౌన్: రాష్ట్ర విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించేందుకు విజయవాడలోని గుణదలలో విద్యుత్ ఫోరాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఫోరం అధ్యక్షుడు, రిటైర్డ్ జిల్లా జడ్జి విక్టర్ ఇమ్మానియేల్ అన్నారు. బుధవారం స్థానిక విద్యుత్ కార్యాలయంలో వినియోగదారుల సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ శాఖతో ప్రజలకు నష్టాలు కలిగితే పరిష్కరించేందుకు సదస్సు ఏర్పాటు చేశామని, ఈ అవకాశాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని సూచించారు. విద్యుత్ అధికారులు కూడా సేవా భావంతో పనిచేస్తున్నారన్నారు. వినియోగదారులకు న్యాయమైన తీర్పులు అందిస్తామని చెప్పారు. సదస్సులో మార్కాపురం ఇందిరమ్మ కాలనీకి చెందిన హుసెన్ పీరా తనకు ఒకటిన్నర సంవత్సరం క్రితం రూ.66 వేల బిల్లు వచ్చిందని, ఎస్సీ, బీసీ కాలనీకి చెందిన బాలయ్య శెట్టి తన మీటర్ సక్రమంగా లేదని ఎక్కువ బిల్లు వస్తోందని, దాన్ని మార్చాలని, రాయవరానికి చెందిన సత్యనారాయణ తనకు ఇటీవల రూ.16 వేల కరెంట్ బిల్లు వచ్చిందని, సుంకేసులకు చెందిన మల్లికార్జున రూ.14 వేల కరెంట్ బిల్లు వచ్చిందని ఫిర్యాదు చేశారు. ఆ సమస్యలను వెంటనే పరిష్కరించాలని చైర్మన్ ఆదేశించారు. మొత్తం 18 సమస్యల్లో 16 సమస్యలు పరిష్కరించినట్లు డీఈ షియానాయక్ తెలిపారు. సమావేశంలో ఫోరం సభ్యులు కె.వెంకటకృష్ణ, ఏ.సునీత, ఈఈ నాగేశ్వరరావు, ఏఈ సుబ్బారాయుడు, డివిజన్‌లోని పలువురు విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యార్థులకు టాలెంట్ టెస్టు

కొమరోలు: ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకుని గురువారం ఛత్రపతి శివాజీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ టాలెంట్ టెస్టు 2023 నిర్వహిస్తున్నట్లు సోసియేషన్ నిర్వాహకులు తెలిపారు. మండలంలోని పాఠశాలల్లో 7, 8, 9 తరగతులు చదివే విద్యార్థిని, విద్యార్థులకు టాలెంట్ టెస్టు నిర్వహిస్తున్నామని, కొమరోలులోని కొమరోలు పబ్లిక్ స్కూల్ ఆవరణలో గురువారం ఉదయం 9 గంటలకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు టాలెంట్ టెస్టులో పాల్గొనవచ్చని, పరీక్ష పత్రం తెలుగు మాధ్యమంలో ఉంటుందని నిర్వాహకులు వివరించారు.

విజేతలకు బహుమతులు

మార్కాపురం టౌన్: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి సైన్స్ సంబరాల పరీక్షల్లో విజేతలకు బుధవారం పట్టణంలోని అరవింద స్కూల్లో కరెస్పాండెంట్ వాణీరాధాకృష్ణ ఆధ్వర్యంలో బహుమతులు అందించారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని సిద్ధార్థ జూనియర్ కళాశాల కరెస్పాండెంట్ జి. శ్రీనివాసరెడ్డి సూచించారు. జేవీవీ నాయకులు రవికుమార్, డీకేఎం రఫీ, ఉపాధ్యాయులు మల్లికార్జున, కేదరిన్, రమేష్ పాల్గొన్నారు.


విజేతలతో జేవీవీ నాయకులు

ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించాలి


సిబ్బందితో మాట్లాడుతున్న డీవీవో వెంకటస్వామి

నాగులుప్పలపాడు: ఉపాధి హామీ పథకంలో నమోదైన ప్రతి కుటుంబానికి తప్పకుండా వంద రోజుల పనిదినాలు కల్పించాలని డ్వామా జిల్లా విజిలెన్స్ అధికారి వెంకటస్వామి తెలిపారు. మండలంలోని ఉపాధి కార్యాలయంలో బుధవారం మండల కంప్యూటర్ సెల్‌ను పరిశీలించి సిబ్బందితో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్క కూలీ అకౌంట్ తప్పనిసరిగా కచ్చితత్వంతో ఉండాలన్నారు. అలాగే మస్టర్ల అనుసంధానం క్రమం తప్పకుండా ఉండేలా చూసుకోవాలన్నారు. అనంతరం కార్యాలయ రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో ఏపీవో ధనుంజయ్, ఈసీ విజయలక్ష్మి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏడాదికి రెండుసార్లు రక్తదానం చేయాలి


రక్తదానం చేస్తున్న రైజ్ విద్యార్థులు

ఒంగోలు: ఏడాదికి రెండుసార్లు రక్తదానం చేయవచ్చని, అలా చేసినందువలన చాలా ఆరోగ్యంగా ఉంటారని రైజ్ కళాశాల కరస్పాండెంట్ శిద్దా హనుమంతరావు, డైరెక్టర్ ఏవీ భాస్కరరావు అన్నారు. స్థానిక వల్లూరు సమీపంలోని రైజ్ ఇంజినీరింగ్ కాలేజీలో రిమ్స్ వైద్యశాల, రైజ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. రిమ్స్ వైద్యులు డాక్టర్ దుర్గాప్రసాద్ వారి బృందంతో వచ్చి రక్తదానం ఆవశ్యకత, రక్తదానం చేయడం వలన కలిగే మేలు, యువతకు ఉన్న అపోహల గురించి వివరించారు. రక్తదానం చేయడం ద్వారా ప్రాణదాతలుగా మారాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్.సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడి


శనగలో మెళకువలు చెబుతున్న ఏవో పావని

చీమకుర్తి: శనగ పంటలో రైతులు ముందస్తుగా సస్యరక్షణ చర్యలు చేపడితే ఖర్చు తక్కువతో కావడంతో పాటు అధిక దిగుబడి సాధించవచ్చని సంతనూతలపాడు మండల వ్యవసాయాధికారిణి పీ పావని తెలిపారు. మద్దులూరు గ్రామంలో స్థానిక రైతులు సాగు చేస్తున్న శనగ పంటను బుధవారం పరిశీలించి పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. శనగ పంటలో చీడపీడలు వ్యాపించకుండా ఉండేందుకు కార్బన్‌డిజమ్, ట్రైకోడెర్మోటాతో విత్తనాలను శుద్ధి చేసుకోవాలన్నారు. శనగ పంట చుట్టూ జొన్న, సజ్జ పంటలతో పాటు బంతి పూల చెట్లను ఎరపంటలుగా సాగు చేసుకోవాలన్నారు. వాటితో పాటు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయడం వలన శనగ పంటలకు తెగుళ్లను వ్యాపింపజేసే పురుగులను నియంత్రించవచ్చన్నారు. కార్యక్రమంలో స్థానిక వీఆర్ఏలు, రైతులు పాల్గొన్నారు.

వేలం కేంద్రం అధికారిగా సత్యశ్రీనివాస్


సత్య శ్రీనివాస్‌ను అభినందిస్తున్న మారెడ్డి సుబ్బారెడ్డి, వేలం కేంద్రం రైతు నాయకులు

మద్దిపాడు: మండలంలోని వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రం నిర్వహణ అధికారిగా సత్య శ్రీనివాస్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో వెల్లంపల్లిలో ఫీల్డ్ ఆఫీసర్‌గా ఈయన పనిచేశారు. అనంతరం జంగారెడ్డిగూడెం బదిలీపై వెళ్లి అక్కడి నుంచి కలిగిరి వేలం నిర్వహణ అధికారిగా కూడా పనిచేశారు. మళ్లీ వెల్లంపల్లి వేలం కేంద్రం నిర్వహణ అధికారిగా బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన సత్య శ్రీనివాస్‌ను భారత పొగాకు బోర్డు సభ్యుడు మారెడ్డి సుబ్బారెడ్డి, వేలం కేంద్రం రైతు నాయకులు అబ్బూరి శేషగిరి, మహేష్, తదితర నాయకులు, వెల్లంపల్లి వేలం కేంద్రం సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

మహిళాభివృద్ధికి కృషి చేయాలి


వినతిపత్రం ఇస్తున్న వీరయ్య మాదిగ, డానియేల్

మార్కాపురం: రాష్ట్ర ప్రభుత్వం మహిళాభివృద్ధికి కృషి చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ కోరారు. బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆయన వినతిపత్రం అందించారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించాలని, అర్హులైన పేద మహిళలకు అసైన్మెంట్ కమిటీ ద్వారా 3 ఎకరాల భూమి పంపిణీ చేయాలని, జంబు ద్వీపం పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ, అగ్రకుల పేదలకు 400 యూనిట్ల ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించాలని కోరారు. కన్నతల్లి బాలికల సంరక్షణ కోసం రెండు లక్షల రూపాయలు బ్యాంక్‌లో డిపాజిట్ చేయాలని ప్రభుత్వాలను కోరుతున్నట్లు తెలిపారు. మహిళలపై లైంగిక వేధింపులు, హత్యలు, అత్యాచారాలను నిరోధించేందుకు కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో చట్టం తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాట్ల డానియేల్, జిల్లా నాయకులు విలియం, మహిళ నాయకులు వీరకుమారి, రాణి, లలితమ్మ, మాణిక్యం పాల్గొన్నారు.

ఆ ఆరోపణలు అవాస్తవం

దొనకొండ: పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా దొనకొండలోని అన్ని వీధుల్లో విచ్చలవిడిగా సంచరిస్తున్న పందులను పంచాయతీ కార్యదర్శి పి.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పట్టుకుని నల్లమల కొండల్లో వదిలేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం పంచాయతీ వారు పందులు పట్టుకున్నారు. కార్యదర్శి కృష్ణమూర్తి రూ.4 లక్షలు తమను అడిగారని, అందుకు తాము నిరాకరించామని పెంపకందారులు చేసిన మాటలు అవాస్తవమని సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌రత్నకుమారి దేవానంద్ వెల్లడించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాన్ని అభివృద్ధి చేయడంలో పంచాయతీ వారు దోహద పడుతుంటే పందుల పెంపకందారులు విడ్డూరంగా లేని పోని మాటలు మాట్లాడి ఇబ్బందులు పెడుతున్నారని మండిపడ్డారు. ఉప సర్పంచ్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీటీసీ గుంటు అజయ్, వార్డు సభ్యులు కె.రామారావు, భట్టు వెంకటేశ్వర్లు, బొందల రాజు, కొమ్మతోటి సుబ్బారావు ఉన్నారు.

పాఠశాలల తనిఖీ

కంభం: మండలంలోని ఎల్‌కోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలను బుధవారం అకడమిక్ మానిటరింగ్ కమిటీ సభ్యులు తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, వార్షిక ప్రణాళికలు, ట్యాబ్‌ల వినియోగంపై ఆరా తీశారు. తరగతుల వారీగా విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు పరిశీలించారు. పాఠశాల విద్యార్థుల్లో కనీస అభ్యాసన సామర్థ్యాలు ఉండేలా చూడాలని, భాషా నైపుణ్యాలు పెంపొందించాలని సూచించారు. మానిటరింగ్ కమిటీ సభ్యులు వెంకట రమణయ్య, వీరనారాయణ, పిచ్చిరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు బీవీ రామకృష్ణ, వైవీ ఆచారి పాల్గొన్నారు.

'మా అమ్మా నాన్నలు ఇకపై నన్ను టీవీలో చూస్తారు' అని సంతోష పడింది మిన్ను మణి. దేశీయంగా ఆమె ఆడిన క్రికెట్ మేచ్‌లు టీవీలో టెలికాస్ట్ కాలేదు. 'విమెన్స్ ప్రీమియర్ లీగ్' కోసం 30 లక్షలకు మిన్ను మణిని ఢిల్లీ క్యాపిటల్స్ సొంతం చేసుకున్నాక ఆమె ఆట తప్పక టెలికాస్ట్ కానుంది. రోజుకు నాలుగు బస్సులు మారి 52 కిలోమీటర్ల దూరంలోని క్రికెట్ స్టేడియంకు వెళ్లి ప్రాక్టీస్ చేసిన మణి కేరళలో ఈస్థాయికి ఎదిగిన తొలి గిరిజన మహిళా క్రికెటర్. మహిళా క్రికెట్ ఇప్పుడు విజయ పరంపరలో ఉంది. నిర్లక్ష్య వర్గాల నుంచి కూడా ఈ ఆటకు చేరొచ్చు అని చెబుతున్న మిన్ను మణిది కూడా ఒక విజయగాథ.

గిరిజన విజయం



మిన్ను మణి

'ముప్పై లక్షల రూపాయలు. నా జీవితంలో చూస్తానని అనుకోలేదు. మొదట నేనొక స్కూటీ కొనుక్కోవాలి. బస్సుల్లో తిరుగుతూ ప్రాక్టీసుకు ఇకపై వెళ్లను. ఆ తర్వాతే ఆ డబ్బుతో ఏం చేయాలో ఆలోచిస్తాను' అంది మిన్ను మణి.

ఫిబ్రవరి 13న ముంబైలో 'విమెన్స్ ప్రీమియర్ లీగ్' కోసం మహిళా క్రికెటర్ల వేలం జరుగుతున్నప్పుడు మిన్ను మణి హైదరాబాద్‌లో సౌత్ జోన్ తరఫున ఇంటర్ జోన్ టోర్నమెంట్ ఆడుతోంది. ఆ రోజున 91 బాల్స్‌కు 74 కొట్టి నాటౌట్‌గా నిలిచింది. ఆట ఒకవైపు సాగుతూ ఉన్నా మనసంతా ముంబై ఆక్షన్ మీదే ఉంది.

'పెద్ద పెద్ద మహిళా క్రికెటర్లకు కూడా వేలంలో ధర పలకకపోతుండే సరికి నిరాశ కలిగింది. నా బేస్ ప్రైస్ 10 లక్షలు పెట్టారు. ఎవరూ తీసుకోరేమో అనుకున్నాను. కానీ ఢిల్లీ, బెంగళూరు ఫ్రాంచైజీలు పోటీ పడ్డాయి. 30 లక్షలకు ఢిల్లీ కేపిటల్స్ నన్ను సొంతం చేసుకుంది. అప్పుడు నాకు కలిగిన ఫీలింగ్ మాటల్లో చెప్పలేను' అంది మిన్ను మణి.

'ఆ విషయం ఫోన్‌లో చెప్తే మా అమ్మా నాన్నలు డబ్బు గురించి కాక నా ఆట గురించి అడిగారు. టీవీలో వస్తుందా అన్నారు. వస్తుంది అని చెప్పాను' అంది సంతోషంగా.

కరూచియ

23 ఏళ్ల మిన్ను మణిది కేరళలోని వయనాడ్ జిల్లాలోని గిరిజన గూడెం. ఇది బ్రహ్మగిరి కొండల అంచున ఉంటుంది. మణిది 'కరూచియ' గిరిజన తెగ. వీళ్లు తమను తాము కొండ బ్రాహ్మణులుగా చెప్పుకుంటారు. తమ ఆచారాలు స్ట్రిక్ట్‌గా పాటిస్తారు. గురి చూసి బాణం వేయడంలో మేటిగా పేరు గడించారు. కాని ఇప్పుడు వారంతా చిన్న చిన్న పనులు చేసుకు బతుకుతున్నారు. మిన్ను మణి తండ్రి మణి రోజు కూలి. తల్లి వసంత గృహిణి. చిన్నప్పటి నుంచి మిన్ను మగపిల్లలతో కలిసి పొలాల్లో టెన్నిస్ బాల్‌తో క్రికెట్ ఆడేది. ఎలిమెంటరీ స్కూల్లో రన్నర్‌గా ప్రతిభ చూపేది. 8 వ తరగతిలో హైస్కూల్లో చేరాక ఆమె ప్రతిభను ఆ స్కూల్లో ఎల్సమ్మ బేబీ అనే పీయాటీ టీచరు గుర్తించింది. 'మిన్ను రైట్ ఆర్మ్ ఆఫ్ స్పిన్నర్. రైట్ హ్యాండ్ బ్యాట్స్‌ఉమన్. బౌలింగ్‌లో బ్యాటింగ్‌లో ఆ అమ్మాయి టాలెంట్ చూసి చాలా దూరం వెళుతుందని అనుకున్నాను' అంటుంది ఆ పీయాటీ టీచర్. ఆ పీయాటీ టీచరే పూనుకుని తిరువనంతపురంలోని కేరళ క్రికెట్ అసోసియేషన్ దగ్గరకు తీసుకువెళితే వారు పరీక్షించి ట్రయినింగ్ ఇచ్చారు. దాంతో మిన్ను మణి ముందు వయనాడ్ జిల్లా జట్టుతో అటు పిమ్మట అండర్ 16 జట్టుతో ఆ తర్వాత కేరళ రాష్ట్ర మహిళా జట్టుతో ఆడటం మొదలుపెట్టింది.



తల్లి వసంతతో మిన్ను మణి

కష్టే ఫలి

అయితే మిన్ను మణి క్రికెట్ ఆడటానికి మొదట తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. 'కేరళలో అమ్మాయిలు అథ్లెట్లుగా రాణిస్తారు. నన్ను కూడా ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్‌గా చూడాలని మా అమ్మానాన్నలు అనుకున్నారు. క్రికెట్ మగవాళ్ల ఆట అని వారి అభిప్రాయం. కాని మా పీయాటీ టీచరు వారిని ఒప్పించి నన్ను క్రికెట్‌లోకి తీసుకెళ్లింది. నేను క్రికెట్ బాగా ఆడుతున్నానని తెలిశాక వారు మనస్ఫూర్తిగా ప్రోత్సహించసాగారు' అంది మిన్ను.

కానీ క్రికెట్‌లాంటి ఖరీదైన ఆటకు కావలసిన మంచి కిట్ కూడా మిన్ను దగ్గర లేదు. వాళ్ల నాన్న అప్పులు చేసి మిన్ను ఆట కొనసాగేలా చూశాడు. మిన్ను ప్రాక్టీసు చేయాలంటే వారి గూడేనికి 52 కిలోమీటర్ల దూరంలోని కృష్ణగిరి క్రికెట్ స్టేడియమే గతి. అంత దూరం వెళ్లడానికి మిన్ను తెల్లవారు జామునే లేచి ఇంటి పనుల్లో తల్లికి సాయం చేసి నాలుగు బస్సులు మారి స్టేడియంకు చేరుకునేది. తిరిగి ఇల్లు చేరే సరికి సాయంత్రం 7 అయ్యేది. 'అలిసిపోయేదాన్ని. కాని పట్టుదలగా ఆట కొనసాగించాను' అంటుంది మిన్ను.

ఆటలో విజయాలు

మిన్ను మణి కేరళ అండర్ 23లో ఆ తర్వాత భారత్ అండర్ 23 జట్టులో ప్రతిభ చూపింది. ఇండియా ఏ జట్టుకు ఎంపికై ఆడింది. విమెన్స్ ఆల్ ఇండియా ఒన్ డే టోర్నమెంట్‌లో 8 మేచ్‌లు ఆడి 246 పరుగులు చేసి 12 వికెట్లు తీసింది. దాంతో అందరి దృష్టి మిన్ను మీద పడింది. క్రికెట్ ఆడటం మొదలెట్టాక వచ్చిన కొద్ది పాటి డబ్బులో ప్రతి పైసా తన కోసం తండ్రి చేసిన అప్పులు తీర్చడానికి ఉపయోగించింది. మిగిలిన డబ్బుతో చిన్న ఇల్లు కడితే 2018 వరదల్లో ఆ ఇల్లు దెబ్బతింది. క్రికెట్ అభిమానులు ఆదుకుని రిపేర్లు చేయించారు. ఇప్పుడు 30 లక్షల సంపాదన స్థాయికి మిన్ను చేరింది. 'దీని కంటే జాతీయ జట్టులో స్థానం పొందడమే నాకు ఎక్కువ ఆనందం. అదే నా లక్ష్యం' అంటోంది మిన్ను మణి.

సైబర్ టాక్

ఆన్‌లైన్‌లో డబ్బులు పోతే ఏం చేయాలి?!

కూతురు పుట్టినరోజుకు డ్రెస్ కొనుగోలు చేసిన సౌమ్య ఫోన్ యాప్ ద్వారా పేమెంట్ చేసింది. అయితే, పేమెంట్ మోడ్‌కి వచ్చేసరికి డబ్బులు డెబిట్ అయినట్టు బ్యాంక్ నుంచి మెసేజ్ వచ్చింది కానీ, షాప్ యజమాని ఖాతాలో నగదు క్రెడిట్ కాలేదు. దీంతో ఒకటికి రెండు సార్లు పేమెంట్ చేసింది. ఫెయిల్ అయిన ట్రాన్సాక్షన్ అమౌంట్ రిటర్న్ అవుతుందిలే అని ఊరుకుంది. కానీ, అలా రిటర్న్ అయిన మెసేజ్ ఏమీ రాలేదు. ఆ అమౌంట్‌ను తిరిగి ఎలా పొందడం, లేకపోతే అంతమొత్తం ఎలా వదిలేయడం.. ఓ రెండు రోజులు ఆగి చూద్దామా.. ఇలాంటి సందేహాలతోనే సౌమ్యకు ఆ రోజు గడిచిపోయింది.

ఇటీవల స్మార్ట్‌ఫోన్ ఉన్న ప్రతి వ్యక్తికి ఆన్‌లైన్ పేమెంట్స్ గురించి తెలిసిందే. పండ్లు, కూరగాయల బండి వద్ద కూడా యాప్ ఆధారిత పేమెంట్ ఆప్షన్ కనిపిస్తుంటుంది. ఇందుకు గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎమ్ వంటి వాటి ద్వారా ఆర్థిక లావాదేవీలు జరుపుతుంటాం, ఇలాంటప్పుడు సర్వర్ సరిగ్గా పనిచేయకనో లేదా మరో కారణంగానో ఆన్‌లైన్ లావాదేవీలు నిలిచిపోయినప్పుడు లేదా ఆన్‌లైన్ నగదు మోసాల జరిగినప్పుడు ఏం చేయాలో ప్రతిఒక్కరికీ అవగాహన తప్పక ఉండాలి.

ఫిర్యాదులకు వేదిక

సిటిజన్ ఫైనాన్షియల్ సైబర్ ఫ్రాడ్ రిపోర్టింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (CFCFRM) అనేది భారతదేశంలో పౌరులు ఆర్థిక సైబర్ మోసాలను ఫిర్యాదు చేయడానికి ఒక వేదిక. ఆర్థిక సైబర్ మోసానికి సంబంధించిన సంఘటనలను నివేదించడానికి, నిర్వహించడానికి పౌరులకు అనుకూలమైన, సురక్షితమైన మార్గాన్ని అందించడం ఈ ప్లాట్‌ఫారమ్ లక్ష్యం. మోసానికి సంబంధించిన సంబంధిత పత్రాలు, సాక్ష్యాలను దీనిలో అప్‌లోడ్ చేయచ్చు. ఇది ఆర్థిక సైబర్ మోసాన్ని ఎలా నిరోధించాలనే దానిపై సమాచారం, మార్గదర్శకత్వాన్ని అందిస్తుంది. నివేదిక ఇచ్చాక, విచారణ కోసం సంబంధిత చట్టాన్ని అమలు చేసే ఏజెన్సీకి పంపిస్తుంది. తగిన చర్య కోసం బ్యాంకింగ్ అధికారులకు పంపుతుంది. మోసగాడి ఖాతాలో బాధితుడి డబ్బు ఇంకా అందుబాటులో ఉంటే, బ్యాంకు దానిని హోల్డ్‌లో ఉంచుతుంది. తర్వాత, ఫిర్యాదుదారు అధికారికంగా కోర్టుకు హాజరు కావాలి. ఆ పై డబ్బు బాధితుడి ఖాతాకు బదిలీ చేయబడుతుంది. ఈ స్థితిని ట్రాక్ చేయడానికి ఒక యంత్రాంగాన్ని అందిస్తుంది.

CFCFRM టోల్ ఫ్రీ నెంబర్: 1930

- వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1930కి కాల్ చేయాలి (12 గంటల్లోపు)
- ప్రత్యామ్నాయంగా https://cybercrime.gov.in పోర్టల్‌కు లాగిన్ అయ్యి, ఫిర్యాదు చేయాలి.
- బ్యాంక్ అకౌంట్ నెంబర్, వాలెట్ యుపిఐ, లావాదేవీ ఐడీ, తేదీ, డెబిట్/క్రెడిట్ కార్డ్ నంబర్లు మొదలైనవి ఇవ్వాలి.
- సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు వెళ్లి, రసీదు సంఖ్యను ఎఫ్‌ఐఆర్‌గా మార్చవచ్చు.


RBI వన్ నేషన్ వన్ అంబుడ్స్‌మన్ : టోల్ ఫ్రీ నెం. 14448

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా 'వన్ నేషన్ వన్ అంబుడ్స్‌మన్ పథకం' అందుబాటులోకి వచ్చింది. మొబైల్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, ఇతర ఎలక్ట్రానిక్ చెల్లింపు వ్యవస్థలకు సంబంధించిన వాటితో సహా అన్ని డిజిటల్ లావాదేవీలకు సంబంధించిన ఫిర్యాదులను పరిష్కరించడానికి వినియోగదారులకు ఒకే పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ అందించడం ఈ పథకం లక్ష్యం.

ఈ పథకం కింద, వినియోగదారుల నుండి ఫిర్యాదులను స్వీకరించడానికి, పరిష్కరించడానికి ప్రతి రాష్ట్రంలో ఆర్‌బిఐచే నియమించబడిన అంబుడ్స్‌మన్ ఉంటారు. ఫిర్యాదులను స్వీకరించడం, విషయాన్ని విచారించడం, ఫిర్యాదు సరైనదేనని తేలిన సందర్భాల్లో బాధిత వినియోగదారులకు పరిహారం అందించే అధికారం ఈ అంబుడ్స్‌మన్‌కు ఉంటుంది. అంబుడ్స్‌మన్ స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా పని చేస్తారు. వారి నిర్ణయాలకు బ్యాంకింగ్ సంస్థలు కట్టుబడి ఉంటాయి.

దశల వారీగా నివేదించే ప్రక్రియ...

- సంబంధిత యుపిఐ సర్వీస్ ప్రొవైడర్ పేటీఎమ్, గూగుల్ పే, ఫోన్ పె మొదలైన వాటిపై ఫిర్యాదు.
- టోల్ ఫ్రీ నంబర్ 14448కి కాల్ చేయాలి.
- https://cms.rbi.org.in పోర్టల్‌కు లాగిన్ చేసి, ఫిర్యాదు ఇవ్వచ్చు.
- మీ ఫిర్యాదును CRPC@rbi.org కి ఇ-మెయిల్ చేయచ్చు. (బ్యాంక్ స్టేట్‌మెంట్ లావాదేవీ స్క్రీన్ షాట్‌లు / యుపిఐ, యాప్ లావాదేవీ స్క్రీన్ షాట్‌లు/ పంపిన, స్వీకరించిన ఫోన్ నంబర్లు రెండింటినీ జత చేయాలి)
- బాధితుడి డబ్బు ఇంకా అందుబాటులో ఉంటే, బ్యాంక్ దానిని హోల్డ్‌లో ఉంచుతుంది, తర్వాత ఫిర్యాదుదారు ఖాతాకు బదిలీ చేస్తుంది.



ప్రతీకాత్మక చిత్రం

డబ్బులు ఇరుక్కుపోతే..

డబ్బులు బదిలి చేసినప్పుడు మన అకౌంట్ నుంచి డిడక్ట్ అయినా అవతలి వారికి వెళ్లకపోవడం, లేదా పేమెంట్ ఆగిపోవడం వంటివి జరిగినప్పుడు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా యుపిఐ వివాదానికి పరిష్కారాన్ని తెలుసుకోవచ్చు.

ప్రతి కస్టమర్ PSP యాప్ (పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్లు) / TPAP యాప్ (థర్డ్ పార్టీ అప్లికేషన్ ప్రొవైడర్లు)లో UPI లావాదేవీకి సంబంధించి NPCI పోర్టల్ https://www.npci.org.in/what-we-do/upi/dispute-redressal-mechanism లో ఫిర్యాదు చేయవచ్చు.

ఈ కింది కారణాల వల్ల మాత్రమే అభ్యర్థనలను ఇవ్వాలి..

(ఎ) ఖాతా నుంచి మొత్తం డెబిట్ అయ్యింది కానీ లబ్ధిదారునికి క్రెడిట్ కాలేదు (బి) ట్రాన్సాక్షన్ ఫెయిల్ అయ్యింది కానీ మొత్తం నగదు డెబిట్ అయ్యింది (సి) చేయాల్సిన ఖాతాకు కాకుండా వేరొక ఖాతాకు తప్పుగా బదిలీ అయ్యింది (డి) లావాదేవీ సమయం ముగిసింది కానీ ఖాతా నుంచి డెబిట్ అయ్యింది (ఇ) మోసపూరితమైన లావాదేవీ జరిగింది (ఎఫ్) నగదు లావాదేవీ పెండింగ్‌లో ఉండిపోయింది (జి) లావాదేవీ అసలు యాక్సెస్ అవలేదు (హెచ్) లావాదేవీ రిజెక్ట్ అయ్యింది (ఐ) పరిమితిని మించి పొరపాటున లావాదేవీ జరిగింది.



ఇన్‌పుట్స్: **అనిల్ రాచమల్ల,**
డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్,
ఎండ్ నౌ ఫౌండేషన్

బ్యూటిప్స్

మేకప్ ప్యాచ్‌లు కనిపించకుండా...



వయసు పైబడటం వల్ల చర్మం ముడతలు పడుతుంటుంది. మెడ, గొంతు ప్రాంతంలో చర్మం ముడతలు పడడాన్ని, చారికలు రావడాన్ని గమనించవచ్చు. ఈ సమస్య నివారణకు మెడ వ్యాయామం చాలా అవసరం. ఆకాశాన్ని చూస్తున్నట్టుగా తల పైకి ఎత్తి, తిరిగి నెమ్మదిగా కిందకు దింపాలి. ఇలా నాలుగైదు సార్లు చేయాలి. ఇలా రోజులో 5–6 సార్లుచేస్తూ ఉంటే మెడ దగ్గర చర్మం బిగుతుగా మారుతుంది. అలాగే మెడ, గొంతు దగ్గర మేకప్ వేసుకోవడానికి ముందు ఇలా చేయడం వల్ల మేకప్ ప్యాచ్‌లుగా కనిపించకుండా జాగ్రత్తపడవచ్చు.

మోచేతుల నలుపు తగ్గాలంటే...



- రోజూ స్నానానికి ముందు నిమ్మరసం రాసి, పది నిమిషాలు ఉంచాలి.
- టీ స్పూన్ కొబ్బరి నూనె, అర టీ స్పూన్ నిమ్మరసం కలిపి మోచేతులు, మోకాళ్లపై రాసి వేడి టవల్‌తో తుడవాలి.
- రెండు టీ స్పూన్ల ఆలివ్ ఆయిల్, టీ స్పూన్ పంచదార కలిపి మోకాళ్లకు, మోచేతులకు రాసి, రుద్దాలి. ఇలా చేయడం వల్ల నలుపు తగ్గుతుంది.
- రెండు టీ స్పూన్ల పెరుగులో కొద్దిగా బాదం పొడి కలిపి నలుపుగా ఉన్న చోట రాసి, రుద్ది, శుభ్రపరచాలి.
- పాల మీగడలో చిటికెడు పసుపు రాసి, నలుపుగా ఉన్న చోటరాసి, రుద్ది, శుభ్రపరచాలి.
- టొమాటో రసం లేదా దానిమ్మ రసం తేనె లేదా నూనెతో కలిపి మోకాళ్లకు, మోచేతులకు రాసి, రుద్ది, శుభ్రపరుచుకుంటే నలుపు సులువుగా తగ్గుతుంది.
- నువ్వుల నూనెలో చర్మాన్ని మృదువుగా ఉంచే సుగుణాలు పుష్కలంగా ఉన్నాయి. వారానికోసారి స్నానానికి నువ్వుల నూనె ఉపయోగించడం వల్ల చర్మానికి కావల్సిన ఫ్యాటీ యాసిడ్స్ అంది, మృదువుగా అవుతుంది.

కిచెన్‌టిప్స్



- ఇడ్లీ, దోసెల కోసం బియ్యం, మినప్పప్పు నానబెట్టేటప్పుడు ముందే కడగాలి. నానిన తర్వాత గ్రైండ్ చేసేటప్పుడు కడగడం వల్ల విటమిన్లు నీటిలో పోతాయి. అంతే కాకుండా దుకాణాల్లో వాటికి పురుగుపట్టకుండా నిల్వ చేయడానికి కీటక నాశినులను గనుక వాడి ఉంటే కడగకుండా నానబెట్టినప్పుడు ఆ అవశేషాలతో కూడిన నీటినే బియ్యం, మినప్పప్పు పీల్చుకుంటాయి కాబట్టి అవన్నీ శరీరంలోకి వెళ్లే ప్రమాదం కూడా ఉంటుంది.



- కూరల్లో ఉప్పు ఎక్కువైనప్పుడు అందులో బంగాళాదుంప ముక్కలను వేయాలి. అధికంగా ఉన్న ఉప్పును పొటాటో పది నిమిషాల్లో పీల్చుకుంటుంది.
- గారెల కోసం తయారు చేసుకున్న పిండిలో నీరు ఎక్కువై నూనెలో వేయగానే అంచుల దగ్గర సన్న పలుకులుగా విడిపోతున్నట్లయితే, పిండిలో ఒక టేబుల్‌స్పూను నెయ్యి కలపాలి.



- కూరలు, పులుసులు, సూప్‌లు మరీ పలచగా ఉన్నట్లనిపిస్తే అందులో ఒక టేబుల్‌స్పూను కార్న్‌ఫ్లోర్ కలపాలి. కార్న్‌ఫ్లోర్‌ను అలాగే వేస్తే ఉండలవుతుంది. ముందుగా ఒక కప్పులో వేసి చన్నీటితో కలిపి ఆ మిశ్రమాన్ని కూరల్లో వేస్తే సమంగా కలుస్తుంది.

'స్మార్ట్' వాదనలు అంత స్మార్ట్ కాదు!

ఫెక్స్‌టింగ్!

భార్యాభర్తలు, జీవిత భాగస్వాముల మధ్య ఏదో అంశం మీద వాదోపవాదనలు, చిన్న చిన్న గొడవలు మామూలే. వాదన జరుగుతుండగా... ఆఫీసుకు వెళ్తూ తన పార్ట్‌నర్ నుంచి దూరంగా వెళ్తే గొడవ సద్దుమణగడం ఖాయం. కానీ మొబైల్ ఫోన్‌లో టెక్ట్స్ మెసేజీల రూపంలో అదే గొడవ అదే పనిగా కొనసాగితే...? ఇలా లైఫ్ పార్ట్‌నర్స్ మధ్య ఫైటింగ్ కాస్తా టెక్ట్స్ మెసేజీల రూపంలో కొనసాగడాన్ని'ఫెక్స్‌టింగ్' అనే ధోరణిగా అభివర్ణిస్తున్నారు. మొబైల్స్ ఎన్నెన్నో కొత్త కొత్త రకాల ఫీచర్స్‌తో వస్తున్నాయి కాబట్టి వాటిని 'స్మార్ట్' ఫోన్స్ అన్నారు. కానీ 'ఫెక్స్‌టింగ్' అంత స్మార్ట్ కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



ప్రతీకాత్మక చిత్రం

'ఫెక్స్‌టింగ్' అంటే కేవలం జీవిత భాగస్వాముల మధ్య ఫైటింగ్ అనే కాదు... పేరెంట్స్, ఫ్రెండ్స్ మధ్య కూడా కావచ్చుకానీ... అత్యధికంగా ప్రభావం చూపేది భార్యాభర్తల మధ్యనే కావడంతో సాధారణంగా దాన్ని లైఫ్‌పార్ట్‌నర్స్‌కే ఎక్కువగా ఉపయోగిస్తున్నారు.

అత్యంత ప్రఖ్యాతమైన ఓ సెలబ్రిటీ కేస్‌స్టడీ: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, ఆయన భార్య, అమెరికన్ ఫస్ట్ లేడీ జిల్ బైడెన్‌ల దాంపత్యం వయసు 45 ఏళ్ల పైమాటే. ఇటీవల ఆమె ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తాము వాదించుకునేందుకు టెక్ట్స్ మెసేజీలు వాడతామని చెప్పారు. అందుకు ఓ వినోదాత్మక కారణం కూడా తెలిపారు. తమ ఘర్షణ, వాదోపవాదాలు అమెరికన్ సీక్రెట్ ఏజెన్సీకి తెలియకుండా ఉండేందుకు ఈ మార్గాన్ని ఉపయోగిస్తుంటామని సరదాగా వెల్లడించారామె. అంటే అందరి గుట్టుమట్లు పసిగట్టే అత్యంత సమర్థమైన ఏజెన్సీనే బురిడీ కొట్టించడానికి ఆమె 'ఫెక్స్‌టింగ్'ను ఎంచుకున్నారన్న మాట.




జోబైడెన్, జిల్ బైడెన్

రెండు రకాల వాదనలు

ఫెక్స్‌టింగ్‌లో పార్ట్‌నర్స్ ఎదురెదురుగా ఉండరు కాబట్టి... ముఖ కవళికలూ. అందులోని ఆవేశాలూ, ఉద్వేగాలూ కనిపించవు. వాదన తాలూకు తీవ్రత అక్షరాల్లో అంతగా ప్రభావ పూర్వకంగా కనిపించదు కాబట్టి అంత హానికరం కాదనీ అనేవాళ్లూ ఉంటారు. అంతే కాదు... ఆ వాదన కొనసాగడానికి ఇష్టపడని వారు... టెక్ట్స్‌కు బదులుగా క్రమంగా 'స్మైల్' లేదా షేక్‌హ్యాండ్ ఎమోజీల్లాంటివి ఉపయోగిస్తూ పోతే, ఎదుటివారి నుంచి తగినంత ప్రతిస్పందన లేకపోవడంతో క్రమంగా వాదన సన్నగిల్లిపోతుందనీ, ఎదురుబొదురు ఉన్నప్పటంత హాని జరగకపోవచ్చనీ కొందరు చెబుతుంటారు.

సరిగ్గా దీనికి పూర్తి భిన్నంగా వాదించే వారూ ఉంటారు. మాటలు తడబడవచ్చు. ఏదో మాట సరిగా వ్యక్తం కాకపోవచ్చు. కానీ సరిగ్గా వ్యక్తీకరించగలిగేవాళ్లైతే రాతలోనే ప్రభావం ఎక్కువ అని చెప్పేవాళ్లూ ఉన్నారు.

> ఎప్పుడైనా అభిప్రాయభేదాలు వచ్చినప్పుడు ఎదురుబొదురుగా ఉండి మాట్లాడుకోవడమే మంచిది. కొన్ని పదాలు, పంక్చువేషన్లు, ఎమోజీల వల్ల దురభిప్రాయాలు వచ్చే అవకాశమూ ఉంది. మాటల్లో చెప్పుకునే విషయాలను రాతలో పెట్టినప్పుడు అది మరింతగా హాని చేసే ప్రమాదం ఉంది. 'మీ అభిప్రాయంతో ఏకీభవించకపోవచ్చు, కానీ మీ అభిప్రాయానికి విలువివ్వాల్సిందే' అనే పరస్పర గౌరవ భావన, దృక్పథాల వల్లనే మంచి ఫలితాలు వస్తాయి.
> – డాక్టర్ సుజాత రాజమణి, మానసిక నిపుణులు



పాతగాయాలూ రేగే ప్రమాదం

దంపతుల మధ్య సంభాషణల రూపంలో ఎదురుబొదురుగా ఘర్షణలు జరుగుతున్నప్పుడు ఏదైనా మాటతూలినా గాలికి పోయే మాటల వల్ల ఆ తర్వాత ఎలాంటి ప్రభావమూ ఉండదు. కానీ 'రాత' ఎప్పటికీ నిలిచిపోయే అవకాశం ఉంది. అందువల్ల ఆ తర్వాత ఎప్పుడో చదువుకున్నప్పుడూ పాత మాటలూ, పాత వాదనల ప్రభావాలు కెలికినట్లుగా అయి, అవి ఆ తర్వాతెప్పుడో కూడా ప్రమాదం తెచ్చిపెట్టవచ్చని మరికొందరు చెబుతున్నారు.

అంతుఉండకపోవచ్చు...
ఆ అంశమే ప్రమాదం తేవచ్చు...

పొద్దున్నే భార్యాభర్తల మధ్య వాదన చెలరేగింది. ఇద్దరూ తమ తమ పనులు చేసుకుంటూనే వాదనల్లో మునిగిపోయారు. ఆఫీసుకు బయల్దేరే సమయానికి ఘర్షణ పెద్దదైంది. కానీ ఆఫీసు సమయానికి ఎవరి దారిలో వాళ్లు వెళ్లిపోవడంతో ఆ 'వాదోపవాదాలు' అక్కడితో ముగుస్తాయి. కానీ 'ఫెక్స్‌టింగ్' అలా కాదు. ఆఫీసుకు వెళ్లే దారిలో బస్సులోనో, ఆటోలోనో లేదా మెట్రోరైల్ లోనో అలాగే కొనసాగవచ్చు. అంతేకాదు... ఆఫీసుకు చేరి, సీట్లలో కూర్చున్నాక కూడా అదేపనిగా కొనసాగితే ప్రమాదమే. ఆ మాటకొస్తే కీలకమైన మీటింగుల్లోనూ 'టెక్ట్స్ మెసేజు'లు కొనసాగుతూ... అసలు లక్ష్యానికి అడ్డంగా మారవచ్చు. టెక్ట్స్ వల్ల ఒనగూరే సౌలభ్యమల్లా వాదన మౌనంగా కొనసాగుతూ... అది మాటల ద్వారా బయటకు తెలియదంతే. కానీ పని ప్రదేశంలో... చేయాల్సిన పని వదిలేసి అదేపనిగా వాదులాడుకుంటూ పోతే... ఆఫీసులో పూర్తి చేయాల్సిన పనులు కొనసాగకపోగా / జరగకపోగా... అదే ఇబ్బంది తెచ్చిపెట్టే ప్రమాదమూ ఉందంటున్నారు కపుల్ కౌన్సెలింగ్ నిర్వాహకులు, మనస్తత్వ నిపుణులు. అంతేకాదు... అది పనితీరుతో పాటు, బంధాల విషయాల్లోనూ ప్రమాదం తెచ్చిపెట్టవచ్చునని హెచ్చరిస్తున్నారు.

వస్తువులో కాదు...
అంతా మన విచక్షణలోనే ఉంది...

"ఏదైనా ప్రయోజనం అన్నది ఆ వస్తువును మనం ఉపయోగించే తీరులో లేదా మన విచక్షణను బట్టే ఉంటుందిగానీ... ఉపకరణంలో ఏమీ ఉండదు. ఇంగ్లిష్‌లో చెప్పాలంటే 'ఆబ్జెక్ట్'లో కాకుండా 'ఆబ్జెక్టివ్'లోనే అంతా ఉంది" అంటూ వ్యాఖ్యానిస్తున్నారు కొందరు మనస్తత్వ నిపుణులు.